సాక్షి
ఖమ్మం
గురువారం। 8। ఆగస్టు। 2024



ప్రసవ వేదన
సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రిలో అనస్తీషియన్ బదిలీ కావడంతో సిజేరియన్ అవసరమైన గర్భిణులను ఖమ్మం రిఫర్ చేస్తున్నారు. 8లో



సీఎం సభాస్థలి మార్పు
వైరాలో ఈనెల 15న జరగనున్న సభకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకానుండగా తొలుత ఖరారు చేసిన స్థలాన్ని మార్చాలని భావిస్తున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
28° / 24°

వాతావరణం
జిల్లాలో గురువారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

రేపు ఇంజనీరింగ్ చివరి దశ కౌన్సెలింగ్

ఖమ్మం సహకారనగర్: ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలకు చివరి దశ కౌన్సెలింగ్ శుక్రవారం జరగనుందని ఖమ్మం ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా తెలిపారు. ఇప్పటి వరకు రెండు విడతల్లో ఎప్‌సెట్ కౌన్సెలింగ్‌కు హాజరు కాని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గురువారం స్లాట్ బుక్ చేసుకుని 9వ తేదీన సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైన వారు 9, 10వ తేదీల్లో వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలని తెలిపారు. ఆయా విద్యార్థులకు 13వ తేదీన సీట్లు కేటాయించనుండగా, 15 నుంచి 17వ తేదీ వరకు కళాశాలల్లో రిపోర్ట్ చేయాలని సూచించారు.

స్పోర్ట్స్ స్కూళ్లకు 11 మంది ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: రాష్ట్రంలోని మూడు స్పోర్ట్స్ స్కూళ్లకు జిల్లా నుంచి 11మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఇందులో హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌కు నలుగురు, ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూల్‌కు ఐదుగురు, కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్‌కు ఇద్దరు ఎంపికకాగా.. వీరిలో ముగ్గురు బాలురు, ఎనిమిది మంది బాలికలు ఉన్నారని డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. జిల్లా నుంచి ఎంపికైన వారిలో జి.ఉత్తేజ్ నాయక్, డి.అనుశ్రీ. సీహెచ్.హన్సిక(కల్లూరు), డి.అక్షిత, డి.అక్షరచంద్ర, ఎ.లితిక(ఖమ్మం అర్బన్), బి.వెన్నెల(పాండురంగాపురం), బి.జస్విత, మూడ్ యశస్విని, బి.చేతన్, శ్రీచందన(ఏన్కూరు) ఉన్నారని వెల్లడించారు.

బోధన ఎలా సాగుతోంది?



వివరాలు సేకరిస్తున్న పూజాపాటిల్

ఖమ్మం అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో 1వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న 'పాఠశాల సంసిద్ధత' కార్యక్రమంపై సర్వే కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఖమ్మం మల్లెమడుగు ప్రభుత్వ పాఠశాలను జాతీయ పరిశోధన శిక్షణ మండలి(ఎన్‌సీఈఆర్‌టీ) అసిస్టెంట్ ప్రొఫెసర్ పూజాపాటిల్ బుధవారం పరిశీలించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడిన ఆమె బోధన వివరాలు, విద్యార్థుల ప్రగతిపై సమీక్షించారు. ఏఎంఓ రవికుమార్, ఎంఈఓ రాములు, హెచ్‌ఎం నాగేంద్రమ్మ, జీవన్, రవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎంఈఓ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

జెడ్పీ ప్రత్యేకాధికారిగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంవన్‌టౌన్: జిల్లా ప్రజాపరిషత్ ప్రత్యేక అధికారిగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జెడ్పీ పాలకవర్గం పదవీకాలం ముగిసిన నేపథ్యాన ఆయనను ప్రత్యేకాధికారిగా ప్రభుత్వం నియమించింది. దీంతో కలెక్టర్ బాధ్యతలు స్వీకరించగా తొలుత సీఈఓ ఎస్.వినోద్, డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మి, వివిధ విభాగాల ఉద్యోగులు స్వాగతం పలికారు. అనంతరం బదిలీపై రాజన్న సిరిసిల్ల జెడ్పీ సీఈఓగా వెళ్తున్న వినోద్‌ను కలెక్టర్ సన్మానించారు.

పెద్దాస్పత్రిలో అసిస్టెంట్ కలెక్టర్



వైద్యులతో మాట్లాడుతున్న మ్రినాల్ శ్రేష్ట

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ట బుధవారం సందర్శించారు.సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యాన కేసుల వివరాలు, ఓపీ నమోదు, చికిత్సపై ఆరాతీశారు. డెంగీ కేసులు, ఇతర వైరల్ ఫీవర్లతో బాధపడుతూ రోజుకు ఎందరు చేరుతున్నారో తెలుసుకున్న ఆయన మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఆతర్వాత ఐసీయూ, ల్యాబ్‌లను పరిశీలించగా.. భవనం పలుచోట్ల కురుస్తుండడాన్ని గుర్తించారు. మెడికల్ సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ బి.కిరణ్‌కుమార్, ఆర్‌ఎంఓ డాక్టర్ రాంబాబు తదితరలు పాల్గొన్నారు.

ఎడతెరిపి లేని వాన



సత్తుపల్లి మండలంలోని కిష్టారం - చెరుకుపల్లి మధ్య ముగ్గు వాగు ప్రవాహం



అలుగు పోస్తున్న వైరా మండలంలోని సోమవరం నల్లకుంట చెరువు

- నిండిన ప్రాజెక్టులు, చెరువులు
- మత్తడి పోస్తున్న బేతుపల్లి చెరువు, ఆకేరు చెక్‌డ్యామ్
- జలకళ సంతరించుకుంటున్న పాలేరు, వైరా రిజర్వాయర్లు
- రహదారులపైకి నీరు చేరడంతో నిలిచిన రాకపోకలు
- కొన్నిచోట్ల నివాసాల్లోకి చేరిన వరద



తల్లాడ మండలం మంగాపురంలో నీటమునిగిన పాలాలు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: నైరుతి రుతుపవనాలతోపాటు కేరళ తీరంలో ద్రోణి ప్రభావంతో జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు భారీ వర్షం పడింది. మరోవైపు నాగార్జునసాగర్ నుంచి నీరు విడుదల కావడంతో పాలేరు, వైరా రిజర్వాయర్లు జలకళ సంతరించుకున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షంతో జిల్లాలోని మిగిలిన ప్రాజెక్టులు, చెరువుల్లోకి వరద చేరుతుండగా.. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మంగళవారం ఉదయం 8–30 గంటల నుంచి బుధవారం ఉదయం 8–30 గంటల వరకు జిల్లాలో 3.1 సెం.మీ. వర్షపాతం నమోదైంది. ఈ వర్షంతో సత్తుపల్లి గనుల్లో 28వేల టన్నుల బొగ్గు బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది.

నిండుకుండల్లా ప్రాజెక్టులు, చెరువులు

భారీ వర్షాలతో ప్రాజెక్టులు, చెరువుల్లోకి నీరు చేరుతోంది. వైరా రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యం 18.3 అడుగులు కాగా ప్రస్తుతం 17 అడుగులకు చేరింది. పాలేరు రిజర్వాయర్ నుంచి విడుదల చేసిన నీరు కూడా వైరా రిజర్వాయర్‌లోకి చేరనుంది. సత్తుపల్లిలోని బేతుపల్లి చెరువు సామర్థ్యం 16 అడుగులు కాగా.. ప్రస్తుతం 16.8 అడుగుల మేర చేరగా అలుగు పోస్తోంది. ఇక బేతుపల్లి ప్రత్యామ్నాయ కాల్వ(ఎన్‌టీఆర్ కెనాల్) నుంచి వేంసూరు మండలానికి 200 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. పాలేరు రిజర్వాయర్‌లో 23 అడుగుల నీటి మట్టానికి గాను 18.5 అడుగుల మేర నీరు ఉండగా...సాగర్ నుంచి 2,600 క్యూసెక్కులు వస్తోంది. ఇక్కడి నుంచి పాలేరు పాత కాల్వకు 320 క్యూసెక్కులు, భక్తరామదాసు ప్రాజెక్టుకు 275 క్యూసెక్కులను వదులుతున్నారు. బుధవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఎడమ కాల్వ ద్వారా జిల్లాలోని సాగర్ ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు. మరోపక్క తిరుమలాయపాలెం మండలంలోని ఆకేరు చెక్‌డ్యామ్‌లు వరద తాకిడితో పొంగుతున్నాయి.

బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు అత్యధిక వర్షపాతం నమోదైన ప్రాంతాలు

మండలం	వర్షపాతం (సెం.మీ.ల్లో)
గంగారం	10.4
సత్తుపల్లి	5.4
పంగిడి	5.0
లింగాల	4.1
గౌరారం	4.0
పెనుబల్లి	3.9
చింతకాని	3.4
కారేపల్లి	3.4
కాకరవాయి	3.3
తిరుమలాయపాలెం	2.8
ఖానాపురం	2.8

ఆగకుండా వాన

దాదాపు జిల్లా అంతటా తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురవగా.. ఒకటి, రెండు ప్రాంతాల్లో భారీ వర్షం నమోదైంది. రెండు మండలాల్లో తేలిక పాటి వర్షం, 18 మండలాల్లో ఓ మోస్తరు, ఒక మండలంలో భారీ వర్షం కురిసింది. ఈ వర్షంతో చాలాచోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పలు ప్రాంతాల్లో వరి, పత్తి చేన్లలోకి నీరు చేరింది. జిల్లాలోని సత్తుపల్లిలో రహదారుల పైకి వరద నీరు చేరింది. మండలంలోని కిష్టారం -చెరుకుపల్లి గ్రామాల మధ్య ముగ్గు వాగు ప్రవాహంతో రాకపోకలు నిలిచిపోయాయి. వేంసూరు మండలం యర్రగుంట పంచాయతీ పరిధిలోని ఎస్టీ కాలనీ నివాస గృహాల్లోకి నీరు చేరడంతో వారికి ఎస్సీ హాస్టల్‌లో పునరావాసం ఏర్పాటు చేశారు. సత్తుపల్లి–ఖమ్మం జాతీయ రహదారిపై కిష్టారం ఓసీ వద్ద భారీగా వరద నీరు చేరగా రాకపోకలకు ఇక్కట్లు ఎదురయ్యాయి. సత్తుపల్లి–సిద్ధారం రోడ్డు పై మూడు అడుగుల మేరకు వరద పోటెత్తింది. పెనుబల్లి– గంగదేవిపాడు మధ్య రాథోని అలుగు వాగు ప్రవాహంతో రాకపోకలు నిలిచిపోయాయి. కల్లూరు మండలం అడవిబోడిమల్లెలో ఓ ఇల్లు కూలగా.. కల్లూరు పెద్ద చెరువుకు అలుగు పడడంతో కల్లూరు–లక్ష్మీపురం మధ్య రాకపోకలు నిలిపివేశారు. తల్లాడ మండలం మంగాపురం తదితర గ్రామాల్లో పొలాలు నీట మునిగాయి. గురువారం కూడా వర్షసూచన ఉండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు.



తిరుమలాయపాలెంలో పత్తి చేనులో నిలిచిన వర్షపు నీరు

లోతట్టు ప్రాంతాలు జలమయం

ఖమ్మం నగరంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు చేరింది. ఖమ్మం 34వ డివిజన్‌లో వర్షం ధాటికి చెట్టు కొమ్మలు విరిగిపడగా అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. వైరా రూరల్ మండలం ముగ్గు వెంకటాపురం వద్ద ఊటవాగు పొంగడంతో పొలాల మీదుగా వరద పారింది. కారేపల్లి పెద్ద చెరువు, సోమవరం నల్లకుంట చెరువు అలుగు పోస్తున్నాయి. ఖమ్మం–డోర్నకల్ మధ్య రఘునాథపాలెం మండలం వీ.ఆర్.బంజర వద్ద బుగ్గవాగు పొంగి ప్రవహిస్తుండగా రాకపోకలు నిలిచిపోయాయి.

11న సీతారామ ప్రాజెక్ట్ ట్రయల్ రన్?

అశ్వాపురం: సీతారామ ఎత్తిపోతల పథకం పూర్తిస్థాయి ట్రయల్ రన్ ఈనెల 11న నిర్వహించనున్నట్లు సమాచారం. ఈనెల 15న ప్రాజెక్టును సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్న నేపథ్యాన ట్రయల్ రన్‌కు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ట్రయల్ రన్‌ను రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించనున్నారని సమాచారం. ములకలపల్లి మండలం పూసుగూడెంలోని రెండో పంప్‌హౌస్, ఆతర్వాత వీకే.రామవరంలో మూడో పంప్‌హౌస్ వద్ద మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ట్రయల్ రన్‌ను ప్రారంభిస్తారని తెలిసింది. అయితే, అశ్వాపురం మండలం బీజీ.కొత్తూరు నుంచి నీరు విడుదల చేయాల్సి ఉండడంతో ఇక్కడి పంప్‌హౌస్‌ను కలెక్టర్ జితేష్ వి.పాటిల్ బుధవారం సందర్శించారు. కాగా, ట్రయల్ రన్‌ను ప్రారంభించాక వైరాలో సీఎం సభకు జరుగుతున్న ఏర్పాట్లను మంత్రి ఉత్తమ్ పరిశీలిస్తారని సమాచారం.

గిరిజన యువతకు ఉపాధి కల్పించాలి



అధికారులతో సమీక్షిస్తున్న పీఓ రాహుల్

భద్రాచలంటౌన్: మారుమూల ఆదివాసీ గిరిజన నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి వారికి జీవనోపాధి కల్పించాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఆదేశించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో బుధవారం ఆయన ఐటీసీ, కేటీపీఎస్, బీటీపీఎస్, జెన్కో, నవభారత్ కంపెనీల మేనేజర్లతో సమావేశమయ్యారు. విద్యార్హత ఉన్నా ఉద్యోగావకాశాలు లేని నిరుద్యోగ యువతకు కంపెనీల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించాలని సూచించారు. అలాగే ఐటీసీ, నవభారత్ ద్వారా గిరిజన సంక్షేమ శాఖ, జీపీఎస్ పాఠశాలల విద్యార్థులకు నోట్‌బుక్సే కాక అంగన్‌వాడీ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అవసరమయ్యే సామగ్రి అందించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏపీఓలు డేవిడ్‌రాజ్, మునీర్ పాషా, వివిధ సంస్థల అధికారులు చంగల్‌రావు, శ్యాంకుమార్ కవాడియా, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరావు, రమేష్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మీ పిల్లలుగానే భావించండి

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం సహకారనగర్: గురుకులాల్లో పనిచేసే ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులను వారి పిల్లలుగానే భావించి మంచీచెడు చూసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. ఖమ్మం అల్లీపురం రోడ్డులోని రామయ్యనగర్‌లో తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గురుకులం పరిసరాలు, తరగతి గదులు, టాయిలెట్లు, డార్మిటరీ బ్లాక్, కిచెన్ షెడ్లు, సామగ్రిని పరిశీలించిన ఆయన మెనూపై ఆరా తీయడంతో పాటు విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకునేందుకు వీలుగా సౌకర్యాలు కల్పించాలని, పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ట, కళాశాల ప్రిన్సిపాల్ సీతామహాలక్ష్మి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాలేరు పార్క్‌ల పరిశీలన

కూసుమంచి: మండలంలోని పాలేరు రిజర్వాయర్ సమీపాన ఉన్న పార్క్‌లను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ బుధవారం పరిశీలించారు. శిథిలావస్థకు చేరిన పార్క్‌ల వివరాలు ఆరా తీసిన ఆయన మంచి వనరులు కలిగిన ప్రాంతంలో పార్క్‌ల నిర్వహణపై నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. పర్యాటక శాఖ అధికారులతో చర్చించి మరమ్మతు చేయించి గ్రామపంచాయతీకి అప్పగించాలని సూచించారు. ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వేపకుంట్లలో డీఎంహెచ్‌ఓ పర్యటన



పనులను పర్యవేక్షిస్తున్న డీఎంహెచ్‌ఓ మాలతి, అధికారులు

రఘునాథపాలెం: మండలంలోని వేపకుంట్లకు చెందిన పలువురు జ్వరం, కీళ్ల నొప్పులతో బాధపడుతుండడంతో బుధవారం డీఎంహెచ్‌ఓ మాలతి, అధికారులు గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో పలువురి ఇళ్లకు వెళ్లి వివరాలు తెలుసుకోవడంతో పాటు రక్త నమూనాలు సేకరించారు. అలాగే, గ్రామపంచాయతీ సిబ్బంది ద్వారా చేపడుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలను డీఎల్‌పీఓ ప్రభాకర్ రావు తనిఖీ చేశారు. డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్, సీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీదేవి, ఎంపీడీఓ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. కళ్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో బుధవారం స్వామి వారి నిత్యకల్యాణం కమనీయంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన పూజలు చేశారు. ఆతర్వాత బేడా మండపంలో కొలువుదీర్చి స్వామికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. అనంతరం స్వామికి కంకణధారణ, యజ్ఞోపవేత ధారణ, సీతమ్మ వారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించిన అర్చకులు నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా పూర్తిచేశారు.

16న వరలక్ష్మి వ్రతం

శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు పవిత్రోత్సవాలు జరగనున్నాయి. ఈ ఐదు రోజుల పాటు నిత్యకల్యాణాన్ని రద్దు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే, శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని 16వ తేదీన ఆలయంలో వరలక్ష్మి వ్రతం, బేడా మండపం వద్ద సాయంత్రం 4 గంటలకు సామూహిక కుంకుమార్చన జరపనున్నారు. ఈ పూజల్లో పాల్గొనేందుకు మహిళలు రూ.200 చెల్లించాలని ఈఓ రమాదేవి ఓ ప్రకటనలో సూచించారు.

సాగర్ ఆయకట్టుకు ఢోకా లేదు...

- 15న సీతారామ ప్రాజెక్టు మొదటి దశ ప్రారంభం
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- పాలేరు ఎడమ కాల్వకు నీటి విడుదల



నీటిని విడుదల చేస్తున్న మంత్రి శ్రీనివాసరెడ్డి, పక్కన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

కూసుమంచి: వరుణ దేవుడి కరుణ, తదాస్తు దేవతల ఆశీస్సులతో ఇందిరమ్మ రాజ్యంలో పుష్కలంగా వర్షాలు కురిసి ప్రాజెక్టులు నిండినందున ఈ ఏడాది సాగర్ ఆయకట్టులో రెండు పంటలకు సరిపడా సాగునీరు అందుతుందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. మండలంలోని పాలేరు రిజర్వాయర్ నుంచి జిల్లాలోని సాగర్ ఆయకట్టుకు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో కలిసి బుధవారం ఆయన సాగునీరు విడుదల చేశారు. ఈసందర్భంగా మంత్రి, కలెక్టర్ కృష్ణా జలాలకు పూజలు నిర్వహించి ప్రవాహాన్ని పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 37 మండలాల్లో 2.75లక్షల ఎకరాలకు పాలేరు నుంచి సాగునీటి సరఫరా అవుతోందని తెలిపారు. అంతేకాక ఏపీలోని 1.25లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. సాగర్ డ్యాంలో పుష్కలంగా నీరు ఉన్న నేపథ్యాన రైతులు ఆనందంగా రెండు పంటలు సాగుచేసుకోవాలని సూచించారు.

కొరత రాకుండా...

ఎప్పుడైనా వర్షాభావ పరిస్థితులతో కృష్ణా జలాల కొరత ఏర్పడితే ఆ లోటు పూడ్చేందుకే సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను పాలేరుకు రప్పిస్తున్నామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ ప్రాజెక్టు మొదటి దశను ఈనెల 15న సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. సాగర్ ప్రాజెక్టుతో పాటు సీతారామ ద్వారా మేజర్, మీడియం ప్రాజెక్టులు, చెరువులను నింపి ఆయకట్టుకు నీరు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. పాలేరు నియోజకవర్గంలో భక్తరామదాసు ప్రాజెక్టు ద్వారా అన్ని చెరువులను నింపి సాగుకు ఇబ్బంది లేకుండా చూస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో జలవనరుల శాఖ సీఈ విద్యాసాగర్, ఈఈ అనన్య, డీఈఈ మధు, జేఈ నవీన్‌తో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. కాగా, పాలేరు నుంచి నీరు విడుదల నేపథ్యాన రెండు రోజుల్లో వైరా రిజర్వాయర్‌కు చేరుతుందని అధికారులు తెలిపారు.

నేడు జిల్లాలో మంత్రి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 8గంటలకు ఆయన ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా చింతలపూడి మండలం ప్రగడవరం గ్రామానికి వెళ్లనుండగా.. మధ్యాహ్నం 3గంటలకు సత్తుపల్లి మండలం యాతాలకుంటకు చేరుకుంటారు. అక్కడ సీతారామ ప్రాజెక్టు పనులను మంత్రి పరిశీలిస్తారు. ఆతర్వాత సాయంత్రం 5గంటలకు ఖమ్మం రూరల్ మండలం నాయుడుపేటలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తారు.



ఒక్కో బెడ్‌పై ఇద్దరు చొప్పున చికిత్స పొందుతూ...

'సీజనల్' రద్దీ...

జిల్లాలో డెంగీ, చికున్‌గున్యా, టైఫాయిడ్ తదితర సీజనల్ వ్యాధుల బారిన పడుతున్న వారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది. ఫలితంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు జ్వరపీడితులతో కిటకిటలాడుతున్నాయి. ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నిత్యం 1,500 మంది వరకు ఓపీ నమోదవుతోంది. ఇందులో సగం మేర జ్వరపీడితులే ఉంటున్నారు. దీంతో ఇన్‌పేషంట్లతో బెడ్లు నిండిపోగా.. ఒకరు వెళ్తే తప్ప ఇంకొకరికి బెడ్ కేటాయించే పరిస్థితి లేదు. అయితే, ప్రస్తుతం కొన్నివార్డుల్లో బెడ్‌కు ఇద్దరు చొప్పున చికిత్స అందిస్తున్నారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్



ఒకే బెడ్‌పై ఇద్దరికి వైద్యం చేస్తున్న సిబ్బంది

క్లుప్తంగా

మార్కెట్లలో షాపులకు 20లోగా దరఖాస్తులు

ఖమ్మం సహకారనగర్: జిల్లా కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్లలో ఖాళీగా ఉన్న దుకాణాలను అద్దె ప్రాతిపదికన కేటాయించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఆయా మార్కెట్ల ఎస్టేట్ అధికారులను ఈనెల 20వ తేదీలోగా సంప్రదించాలని సూచించారు. ఖమ్మం వీడీవోస్ కాలనీలోని ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ మొదటి అంతస్తులు 28 దుకాణాలు, ఎన్నెస్పీ కాలనీ రైతుబజార్‌లో ఏడు షాపులు, 30 ప్లాట్ ఫాంలు, మూడు పగోడాలు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

శునకానికి సీమంతం !



శునకంతో ఈశ్వరరాణి తదితరులు

మధిర: కన్నకుమార్తె మాదిరి పెంచుకుంటున్న శునకం గర్భం దాల్చడంతో సీమంతం నిర్వహించిన యజమాని తన ప్రేమను చాటుకున్నారు. మధిర లక్ష్మీ శ్రీనివాస థియేటర్ సమీపాన హోటల్ నడిపించే ఈశ్వరరాణి ఏడాదిగా కుక్కను పెంచుతున్నారు. అది మూడు నెలల క్రితం గర్భం దాల్చగా బుధవారం పట్టు బట్టలతో ముస్తాబు చేయడంతో పాటు ఇరుగు పొరుగు, బంధువులను పిలిచి సీమంతం నిర్వహించారు. హాజరైన వారికి తాంబూలం కూడా ఇవ్వగా.. ఈశ్వరరాణి మాట్లాడుతూ శునకాన్ని తమ కుమార్తె మాదిరిగా చూసుకుంటుండడంతో సీమంతం నిర్వహించినట్లు తెలిపారు.

ఉపాధ్యాయురాలిపై సస్పెన్షన్ ఎత్తివేత

- విద్యార్థుల జుట్టు కత్తిరించడంతో గతనెల 27న వేటు

ఖమ్మం సహకారనగర్/కల్లూరు/కల్లూరురూరల్: కల్లూరు మండలం పేరువంచలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఇంగ్లిష్ టీచర్ దిగుమర్తి శిరీషపై సస్పెన్షన్ ఎత్తివేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల 27న హైస్కూల్‌లో 25 మంది విద్యార్థుల జుట్టు కత్తిరించడంతో ఆమెను సస్పెండ్ చేసిన విషయం విదితమే. అయితే, శిరీషపై సస్పెన్షన్ తొలగించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు విన్నవించారు. ఈ మేరకు సస్పెన్షన్ ఎత్తేవేయడంతో పాటు చెన్నూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు జారీచేశారు. కాగా, శిరీషపై సస్పెన్షన్ ఎత్తివేసిన నేపథ్యాన ఎస్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ సైదులు, పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మినేని అనిల్‌కుమార్, ముత్తినేని సురేష్ హర్షం వ్యక్తం చేశారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక కేబుల్ ఆపరేటర్ ఆత్మహత్య



నాగేశ్వరరావు (ఫైల్)

ముదిగొండ: ఆర్థిక ఇబ్బందులు తాళలేక కేబుల్ ఆపరేటర్ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నేలకొండపల్లి మండలం గువ్వలగూడెంకు చెందిన మందనపు నాగేశ్వరరావు(45) కేబుల్ ఆపరేటర్‌గా జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా ఖమ్మంలో నివాసముంటుండగా, ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో సువర్ణాపురం రెవెన్యూ పరిధిలోని ఓ మామిడి చెట్టుకు మంగళవారం అర్ధరాత్రి ఉరి వేసుకున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉండగా.. నాగేశ్వరరావు తండ్రి ఫిర్యాదుతో బుధవారం కేసు నమోదు చేసినట్లు ముదిగొండ ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

పెరుగుతున్న 'ఆన్‌లైన్' బాధితులు

వేంసూరు: రెండింతలు లాభం వస్తుందని నమ్మబలికి తొలినాళ్లలో సక్రమంగానే చెల్లించిన యాప్ నిర్వాహకులు ఆ తర్వాత ముఖం చాటేయడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. వేంసూరు మండలం కందుకూరుకు చెందిన ఇద్దరు రూ.2.80లక్షలు, రూ.93వేల మేర మోసపోయినట్లు మంగళవారం ఫిర్యాదు చేశారు. అయితే, బాధితుల సంఖ్య పెరుగుతోంది. బుధవారం మరో ముగ్గురు పోలీసులను ఆశ్రయించారు. వీరు రూ.1.80 లక్షలు, రూ.65వేలు, రూ.52 వేల చొప్పున మోసపోయామని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై వీరప్రసాద్ తెలిపారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ఠ	కనిష్ఠ
పెసలు	7,400	5,500
మిర్చి	17,900	10,800
మిర్చి తాలు	9,000	7,000
ఏసీ మిర్చి	19,600	10,000
ఏసీ తాలు	9,500	9,000
పత్తి	7,275	4,500

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,828

ప్రసవ వేదన..



సత్తుపల్లిలోని మాతా శిశు సంరక్షణ కేంద్రం

సత్తుపల్లిలో ఆపరేషన్లు బంద్
- మత్తు డాక్టర్ బదిలీతో ఆటంకం
- ఎవరొచ్చినా ఖమ్మంకే రిఫర్
- సాధారణ ప్రసవాలకే పరిమితం

సత్తుపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన లక్ష్మికి నెలలు నిండి పురిటి నొప్పులు వస్తుండడంతో ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. అయితే, సిజేరియన్ చేయాల్సి ఉందని వైద్యులు నిర్ధారించారు. కానీ ఆస్పత్రిలో మత్తు డాక్టర్ లేకపోవడంతో ఖమ్మం ఆస్పత్రికి రిఫర్ చేశారు. దీంతో లక్ష్మిని ఆమె బంధువులు నానా ఇబ్బంది పడుతూ ఖమ్మం తీసుకెళ్లారు. ఆపై ఆపరేషన్ చేయడంతో ఆమె ప్రసవించినా మార్గమధ్యలో ఏదైనా జరిగితే పరిస్థితి ఏమిటన్న ప్రశ్న బంధువులను వేధించింది.

సాధారణ కాన్పులకే పరిమితం

ఆస్పత్రిలోని మాతశిశు సంరక్షణా కేంద్రంలో గైనకాలజిస్టులు ఉన్నప్పటికీ నెలలు నిండి పురిటినొప్పులతో వచ్చే గర్భిణులకు సాధారణ కాన్పు మాత్రమే చేయగలుగుతున్నారు. తప్పనిసరి శస్త్రచికిత్స చేయాల్సి వస్తే మత్తు డాక్టర్ లేక పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది.



సిజేరియన్ వార్డులో ఖాళీగా ఉన్న పడకలు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి ఏరియా ఆస్పత్రిలో మత్తు డాక్టర్(అనస్తీషిన్)గా విధులు నిర్వర్తిస్తున్న ఎస్.కిరణ్‌కుమార్‌ను ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా పెనుబల్లి ఏరియా ఆస్పత్రికి బదిలీ చేశారు. ఆపై మరెవరూ ఇక్కడకు రాకపోవడంతో శస్త్రచికిత్సలపై ప్రభావం పడుతోంది. ప్రధానంగా ప్రసవం వచ్చే గర్భిణీలను తప్పనిసరిగా ఖమ్మం పంపించాల్సి వస్తోంది. ఇదేకాక ఇతర శస్త్రచికిత్సల అవసరమైన వారిని ఖమ్మం, ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లాల్సి వస్తుండడంతో వారి బంధువులు ఆందోళనకు గురవుతున్నారు.

ఇతర ఆపరేషన్లపైనా ప్రభావం

50 పడకలు కలిగిన సత్తుపల్లి ఆస్పత్రిని గత ప్రభుత్వ హయాంలో 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. అంతేకాక రూ.35 కోట్లతో నూతన భవనం నిర్మాణం చేపట్టారు. జాతీయ రహదారిపై ఉన్న ఈ ఆస్పత్రికి నిత్యం రోడ్డు ప్రమాద బాధితులతో పాటు అశ్వారావుపేట నియోజకవర్గం నుంచే కాక చింతలపూడి, వినన్నపేట ప్రాంతాల నుంచి గర్భిణులు వస్తుంటారు. అలాగే, కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు, హెర్నియా, కడుపులో గడ్డలు వంటి శస్త్రచికిత్సలు చేసేందుకు అవసరమైన వైద్యులు ఉన్నప్పటికీ అనస్తీషియన్ లేకపోవడంతో ప్రభావం పడుతోంది. ఉన్నతాధికారులు ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని సత్తుపల్లి ఆస్పత్రికి అనస్తీషియన్‌ను కేటాయించాలనే వినతులు వెల్లువెత్తుతున్నాయి.

సీఎం సభాస్థలి మార్పు..

- మంత్రి పరిశీలించాక తుది నిర్ణయం
- ఎమ్మెల్యే రాందాస్ నాయక్



సభా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాందాస్, నాయకులు

వైరా: సీఎం రేవంత్‌రెడ్డి ఈనెల 15వ తేదీన వైరాలో జరిగే సభకు హాజరుకానున్న నేపథ్యాన ఇప్పటికై వైరాలోని కేవీసీఎం కళాశాల సమీపాన వేదిక ఏర్పాటుకు నిర్ణయించారు. అయితే, ఆ ప్రాంతంలో ఇప్పటికే రైతులు పంటలు వేయడం.. వర్షం వస్తే వాహనాలు వచ్చే వెళ్లేందుకు ఇబ్బందిగా ఉండడంతో అక్కడి నుంచి సభాస్థలిని మార్చాలనే భావనకు వచ్చారు. ఇందులోభాగంగా శాంతినగర్‌లోని న్యూలిటిల్ ఫ్లవర్ పాఠశాలకు ఎదురుగా ఒక వెంచర్‌లో 20 ఎకరాల స్థలాన్ని గుర్తించారు. ఈమేరకు బుధవారం ఆ స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలించిన ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం మరోసారి పరిశీలించాక ఖరారు చేస్తామని తెలిపారు. వర్షాల నేపథ్యాన సీఎం పర్యటన, సభకు ఆటంకాలు ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. కాగా, ఇప్పటికే సభావేదిక నిర్మాణానికి సంబంధించి హైదరాబాద్ నుండి రెయిన్ ప్రూఫ్ సామగ్రి చేరుకుంది. ఈకార్యక్రమంలో ఏసీపీ వెంకటేష్, సీఐ సాగర్, తహసీల్దార్ కే.వీ.శ్రీనివాస్, ఆర్‌అండ్‌బీ ఏఈ విశ్వనాథ్, నాయకులు బొర్రా రాజశేఖర్, కట్ల రంగారావు, కట్ల సంతోష్, హరినాథ్ పాల్గొన్నారు.

దేవాదాయ శాఖలో జూనియర్ అసిస్టెంట్ల బదిలీ

ఖమ్మంగాంధీచౌక్: జిల్లాలోని దేవాదాయ, ధర్మాదాయ శాఖలో పలువురు జూనియర్ అసిస్టెంట్లను బదిలీ చేస్తూ శాఖ కమిషనర్ హన్మంతరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కారేపల్లి సంతగుడి ఆలయంలో పనిచేస్తున్న పి.మోహనకృష్ణను అదే మండలంలోని కోట మైసమ్మ ఆలయానికి, కోట మైసమ్మ ఆలయం నుంచి మూడ్ మోహన్‌ను కారేపల్లి సంత గుడికి, సంత గుడిలో పనిచేస్తున్న నారాయణను ఏన్కూరు మండలం గార్లొడ్డు శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయానికి, గార్లొడ్డు శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం నుంచి వెంకటేశ్వర్లును ఖమ్మం చెరువుబజార్ శ్రీ దాసాంజనేయ స్వామి దేవస్థానానికి బదిలీ చేశారు. అలాగే, చెరువుబజార్ శ్రీ దాసాంజనేయ స్వామి ఆలయం ఉద్యోగి బి.మురళిని కూసుమంచి మండలం జీళ్లచెరువు శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయానికి బదిలీ చేయగా.. జీళ్లచెరువు ఆలయం నుంచి పి.రామదాసును కారేపల్లి సంత గుడికి, ఖమ్మం కాల్వొడ్డు సత్యనారాయణస్వామి సహిత శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయం నుంచి బి.సరోజినిను ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లిలోని శ్రీ మారెమ్మ ఆలయానికి, మారెమ్మ ఆలయం నుంచి ఆంజనేయులను కాల్వొడ్డు శ్రీ సత్యనారాయణ స్వామి సహిత వీరాంజనేయ స్వామి దేవాలయానికి బదిలీ చేశారు. ఆయా ఉద్యోగుల్లో పలువురు బుధవారం నూతన స్థానాల్లో విధుల్లో చేరారు.

రాష్ట్రస్థాయిలో వైరా లయన్స్‌క్లబ్‌కు అవార్డులు



అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న దృశ్యం

వైరా: వైరా లయన్స్‌క్లబ్‌కు రాష్ట్రస్థాయిలో పలు అవార్డులు లభించింది. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా స్థాయిలో అత్యధిక సభ్యత్వాలు నమోదు చేసిన జీఎంటీ కోఆర్డినేటర్ ఉండ్రూ శ్యాంబాబు, మహిళా సభ్యుల పెంపునకు కృషి చేసిన ఎఫ్‌డబ్ల్యూసీ కోఆర్డినేటర్ కొమ్మినేని భారతి, లయన్స్‌క్లబ్ వైరా అధ్యక్షుడు పెనుగొండ ఉపేంద్రరావు, గ్రేట్ విజన్ అధ్యక్షురాలు ఉండ్రూ వరలక్ష్మికి అవార్డులు దక్కాయని పాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ తెలిపారు. వైరాలోని లయన్స్‌క్లబ్, గ్రేట్ విజన్ క్లబ్‌ల ద్వారా రాష్ట్రంలోనే అత్యధికంగా 20 ల్యాప్‌టాప్‌లు, 105 కుట్టు మిషన్లు, 15 వీల్ చైర్లు, 10 ట్రై సైకిళ్లు, తొమ్మిది తోపుడుబండ్లు పంపిణీ చేయడమే కాక ఇతర కార్యక్రమాలకు గాను ఈ అవార్డులు ప్రకటించారని వెల్లడించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలను బుధవారం సన్మానించగా కొల్లా రాంబాబు, తోటకూర శ్రీకాంత్, అబ్బూరి రమేష్, లగడపాటి ప్రభాకర్‌రావు, చింతోజు నాగేశ్వరరావు, గంగవరపు కిషోర్‌రాయి, జాలా పుల్లారావు, ఉయ్యూరు రామకృష్ణ, తాటికొండ రాము, కొమిరిశెట్టి శ్రీధర్, కట్ల సురేష్ పాల్గొన్నారు.

గంజాయి రవాణా కేసులో ముగ్గురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ మధు

మధిర: గంజాయి రవాణా చేస్తూ ముగ్గురు పట్టుబడగా కేసు నమోదు చేసినట్లు మధిర సీఐ మధు తెలిపారు. మధిరలోని కార్యాలయంలో బుధవారం ఆయన వివరాలు వెల్లడించారు. ఎర్రుపాలెం మండలం రేమిడిచర్ల వద్ద బుధవారం చేపట్టిన వాహన తనిఖీల్లో బైక్‌పై వెళ్తున్న ముగ్గురు అనుమానాస్పదంగా కనిపించగా వివరాలు ఆరా తీశామని చెప్పారు. వీరిని తమ్మిశెట్టి ఏసోబు, రామిశెట్టి యుగంధర్, భూక్యా అనూష్‌గా గుర్తించగా ఏపీలోని సీలేరులో మధు వద్ద నుంచి గంజాయి కొని మధిరలో అమ్మేందుకు వస్తున్నట్లు ఒప్పుకున్నారని తెలిపారు. వీరి నుంచి 780గ్రాముల గంజాయి, బైక్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు. కాగా, గంజాయి అమ్మే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని.. యువత నడవడికపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని సూచించారు. ఈసమావేశంలో ఎర్రుపాలెం ఎస్‌ఐ వెంకటేష్ పాల్గొన్నారు.

బర్లగూడెం ఫీల్డ్ అసిస్టెంట్‌పై వేటు

కామేపల్లి: మండలంలోని బర్లగూడెంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనుల్లో అవకతవకలు జరిగినట్లు వచ్చిన ఆరోపణలతో విచారణ చేపట్టిన అధికారులు ఫీల్డ్ అసిస్టెంట్ రాజేష్‌ను సస్పెండ్ చేశారు. గ్రామానికి చెందిన భూక్యా చంద్రశేఖర్ తపాలాశాఖలో విధులు నిర్వర్తిస్తుండగా ఈజీఎస్ పనులకు హాజరైనట్లు మస్టర్లు వేయగా ఆయన ఖాతాలో రూ.2,470 జమ అయ్యాయి. అలాగే, పక్షవాతంతో బాధపడుతున్న వృద్ధుడు బానోత్ రాంజీ కూడా పనులకు వచ్చినట్లు నమోదు చేయడంతో రూ.9,719 నగదు అందింది. వీటికి తోడు పలు అంశాల్లో ఫీల్డ్ అసిస్టెంట్ రాజేష్‌పై ఆరోపణలు రాగా స్థానికులు ఎమ్మెల్యే కనకయ్య దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే సూచనల మేరకు ఇటీవల అదనపు డీఆర్‌డీఏ విచారణ చేపట్టగా ఆరోపణలు నిజమేనని తేలడంతో రాజేష్‌ను సస్పెండ్ చేస్తూ డీఆర్‌డీఏ సన్యాసయ్య బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అంతేకాక ఆయన నుంచి నగదు రికవరీ చేయాలని స్థానిక అధికారులకు సూచించారు. కాగా, మండలంలో ఈజీఎస్ పనుల్లో అవకతవకలపై 'సాక్షి'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి.

క్విజ్ పోటీల్లో విజేతలకు అభినందన



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఖమ్మంరూరల్: ఖమ్మం పెద్దాస్పత్రిలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మంగళవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లాలోని వివిధ నర్సింగ్ కళాశాలల విద్యార్థినులు పాల్గొనగా.. ఖమ్మం రూరల్ మండలం పెదతండాలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థినులు బహుమతులు గెలుచుకున్నారు. వీరిని బుధవారం ప్రిన్సిపాల్ ఎం.రత్నకుమారి, అధ్యాపకులు అభినందించారు.

డివైడర్‌పైకి ఎక్కిన ఆర్టీసీ బస్సు



బస్సును వెనకకు నెడుతున్న ప్రయాణికులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం కొత్త బస్టాండ్ నుంచి బయటకు వెళ్తున్న ఇల్లెందు డిపో బస్సు గేటు డివైడర్‌పైకి దూసుకెళ్లింది. ఔట్ గేట్ సమీపాన రోడ్డు వెడల్పు తక్కువగా ఉండడం, అక్కడే ఆటోలు నిలపడంతో బస్సు రోడ్డుపైకి తిరిగే సమయాన కుడివైపు వెనుక టైర్ డివైడర్‌పైకి ఎక్కింది. దీంతో బస్సు నిలిచిపోగా.. స్థానికులు, ప్రయాణికులు కాసేపు నెట్టినా ప్రయత్నం కానరాలేదు. నానా తంటాలు పడ్డాక బస్సు డివైడర్ పైనుండి దిగడంతో ఊపిరి పీల్చుకున్నారు.

పోగొట్టుకున్న ఫోన్ల అప్పగింత

ములకలపల్లి: సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న మండలంలోని ఇద్దరు బాధితులకు పోలీసులు బుధవారం తిరిగి వాటిని అందించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రాజశేఖర్ మాట్లాడుతూ సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వ్యక్తులు వీలైనంత త్వరగా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది భాను, ధర్మరాజు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అప్పు చెల్లించినా బెదిరిస్తున్నాడని ఫిర్యాదు

ఖమ్మంరూరల్: మండలంలోని జాన్‌బాద్‌తండాకు చెందిన రైతు ఏలేటి వెంకటరెడ్డి ఆత్మహత్యకు జాటోత్ వీరన్నే కారణమని సెల్ఫీ వీడియో విడుదల చేయడంతో కేసు నమోదు కాగా.. మరో ఘటనలోనూ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రామారావు తెలిపిన వివరాల మేరకు.. ఏలేటి వెంకటరెడ్డి 15ఏళ్ల క్రితం వీరన్న వద్ద రూ. 30వేలు వడ్డీకి తీసుకున్నాడు. ఆ సమయాన ఖాళీ ప్రామిసరీ నోటుపై సంతకాలు చేయించుకున్నాడు. ఆతర్వాత గ్రామపెద్దల సమక్షాన వెంకటరెడ్డి రూ.30వేలు చెల్లించినా ప్రామిసరీ నోటు తిరిగి ఇవ్వలేదు. అంతేకాక 2015లో ఆ నోట్ ఆధారంగా వీరన్న ఖమ్మం సివిల్ కోర్టులో కేసు దాఖలు చేయగా.. తీసుకున్న అప్పు వడ్డీతో సహా చెల్లించాలని కోర్టు తీర్పు ఇచ్చింది. అయితే, అప్పు చెల్లించినా ప్రామిసరీ నోట్ ఇవ్వకుండా మోసపూరితంగా కోర్టులో కేసు వేసి బెదిరిస్తున్నాడని వెంకటరెడ్డి కుమారుడు చేసిన ఫిర్యాదుతో వీరన్నపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



వెంకటేశ్వర్లు (ఫైల్)

ఖమ్మంఅర్బన్: ఖమ్మం బోనకల్లు రోడ్డులోని శ్రీరాంనగర్ రోడ్డునంబర్-13లో బుధవారం ఒక ఇంటి నిర్మాణానికి రాడ్ బెండింగ్ పనులు చేస్తున్న వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ధంసలాపురానికి చెందిన ఏ.వెంకటేశ్వర్లు (50) రోజు మాదిరి పనికి వెళ్లగా రాడ్ బెండింగ్‌లో భాగంగా మిషన్ ద్వారా కట్ చేస్తున్న క్రమంలో షాక్‌తో గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనపై బాధిత కుటుంబీకులు ఖమ్మం అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆర్టీసీ బస్సు, స్కార్పియో ఢీ

దుమ్ముగూడెం: మండలంలోని బైరాగులపాడు గ్రామ శివారులో ఆర్టీసీ బస్సు.. స్కార్పియో ఎదురెదురుగా ఢీకొన్నాయి. చర్ల మండలం రైస్‌పేట గ్రామానికి చెందిన కుప్ప విద్యారణ్య, స్నేహితుడు బీరాకురి వినోద్‌కుమార్ తో కలిసి స్కార్పియోలో ఖమ్మం వెళ్తున్నారు. బైరాగులపాడు గ్రామ శివారు లో మూలమలుపు వద్ద భద్రాచలం నుంచి చర్ల వెళ్తున్న ఆర్టీసీ బస్సు.. స్కార్పియో ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో స్కార్పియో అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లగా విద్యారణ్య కుడిచేయికి తీవ్రగాయమైంది. బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ గణేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పత్తిలో యాజమాన్య పద్ధతులు

జాగ్రత్తలపై రైతులకు సూచనలు, సలహాలు



పత్తి చేను (ఇన్‌సెట్) డాక్టర్ కె.రుక్మిణిదేవి

మధిర: కొద్దిరోజులుగా తగ్గుముఖం పట్టిన వర్షాలు మళ్లీ జోరందుకున్నాయి. ఈ నేపథ్యాన పత్తి పంటలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను మధిర వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త, హెడ్ డాక్టర్ రుక్మిణిదేవి, డాక్టర్ టి.భరత్, కె.నాగస్వాతి వెల్లడించారు. ఈమేరకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇలా ఉన్నాయి.

- అధిక వర్షాల కారణంగా చేనులో నీరు నిల్వ ఉంటే వెంటనే తొలగించాలి.
- పోషక లోప సవరణకు తాత్కాలిక నీటిలో కరిగే పోషకాలైన 19:19:19 లేదా 20:20:20 లేదా 13:0:45 నత్రజని:భాస్వరం:పొటాష్ 10 గ్రాములు లేదా యూరియా 20 గ్రాములను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. పత్తి పంటలో 3-4వ వారం దశలో కలుపు నివారణకు ఎకరానికి పైరిథయోబ్యాక్ సోడియం10శాతం ఈసీ 250 మి.లీ., ప్రొపాక్విజాఫాప్ 10శాతం ఈసీ 250 మి.లీ.ను కలిపి లేదా పైరిథయోబ్యాక్ సోడియం 6శాతం, క్విజలోఫాప్ ఇథైల్ 4 శాతం మందుల మిశ్రమాన్ని 500 మి.లీ. లేదా ఫ్యూజీ ఫాప్- పి- బ్యూటైల్ 400 మి.లీ. మందును వాడాలి.
- కలుపు లేత దశలో (2-4)ఆకులు పిచికారీ చేసుకుంటే నివారణ బాగుంటుంది.
- ప్రస్తుతం గొర్రు లేదా గుంటకలతో లేదా పవర్ వీడర్‌తో 10-12 రోజులకోసారి అంతరకృషి చేపట్టాలి. పంట 50-60 రోజుల వరకు కలుపు లేకుండా జాగ్రత్తపడాలి. తద్వారా సకాలంలో కలుపు నిర్మూలన జరగడమే కాకుండా వాన నీటి సంరక్షణ జరిగి పంట పెరుగుదల బాగుంటుంది. భూమిలో తేమ ఆధారంగా సిఫారసు చేసిన పోషకాలను పైపాటుగా 20 రోజుల వ్యవధిలో ఇస్తుండాలి.
- ఎరువుల యాజమాన్యంలో కాంప్లెక్స్ ఎరువులను పంట మొదటి దశలో మాత్రమే వాడి తదుపరి నత్రజని, పొటాష్ ఎరువులే వాడాలి.
- పత్తిలో పైపాటుగా ఎకరాకు 25 కిలోల యూరియా, 10 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ కలిపి మొక్కల దగ్గరగా పడేలా వేయాలి. 20, 40, 60, 80 రోజులకోసారి నాలుగు పర్యాయాలు పైపాటుగా పైన తెలిపినట్లు ఎరువులు వాడాలి.
- భూమి ద్వారా అందించే ఎరువులే కాక అవసరం ఆధారంగా బెట్ట లేదా అధిక వర్షపాత సమయాల్లో.. కాయ ఎదుగుదల దశలో పైపాటుగా పోషకాల పిచికారీ చేపట్టాలి.
- కాయలు ఏర్పడే దశలో 2శాతం డీఏపీ ఎరువుల ద్రావణం 20 గ్రాములను లీటర్ నీటికి లేదా నాలుగు కిలోలను ఎకరానికి బాగా వడపోసి పిచికారీ చేస్తే పూత, గూడు రాలడాన్ని అరికట్టడంతో పాటు కాయల పరిమాణం పెరుగుతుంది. ఇలా 10-12 రోజుల వ్యవధిలో రెండుసార్లు చేపట్టాలి.
- ప్రస్తుతం కొన్నిచోట్ల వేరుకుళ్లు తెగులు ఆశించి మొక్కల వేర్లు కుళ్లిపోయి, కాండం అడుగు భాగంలో బెరడు కుచించుకుపోయి వేర్లు, కాండం నల్లగా మారుతున్నాయి. దీని నివారణకు కార్బండిజం ఒక గ్రాము లేదా టెబ్యుకొనజోల్, ట్రైఫ్లాక్సీస్ట్రోబిన్ 0.75 గ్రాములను లీటర్ నీటికి కలిపి మొక్క మొదళ్లో పిచికారీ చేయాలి. లేదా నేలను తడపాలి. ఈ విధంగా 7-10 రోజుల వ్యవధిలో రెండుసార్లు చేయాలి.
- ఫిప్రోనిల్ 2 మి.లీ. లేదా థయోమిథాక్సిమ్ 0.2 గ్రాములు లేదా ఫ్లానికామిడ్ 0.3 గ్రాములు లేదా ఎసిటామిప్రిడ్ 0.4 గ్రాములు లేదా ఎసిఫేట్ 1.5గ్రాముల మందు వాడి రసం పీల్చే పురుగుల ఉధృతిని అరికట్టొచ్చు.
- అధిక సాంద్రత సాగు విధానంలో 40, 60, 80 రోజుల దశలో 2-3 సార్లు మెపిక్వాట్ క్లోరైడ్ మందును లీటర్ నీటికి పంట మొదటి దశలో ఒక మిలీ., తదుపరి దశలో 1.5 మి.లీ. పిచికారీ చేస్తే శాఖీయ కొమ్మల ఎదుగుదలను నివారించడమే కాక కాయల అభివృద్ధికి దోహదపడుతుంది.
- పత్తిని తేలికపాటి నేలలో సాగు చేస్తే పూత సమయాన చేను ఎరుపెక్కినప్పుడు లీటర్ నీటికి మెగ్నీషియం సల్ఫేట్ 10 గ్రాములు, బోరాన్ 20 గ్రాములు, యూరియా 20 గ్రాములు కలిపి 7-10 రోజుల వ్యవధిలో కనీసం రెండుసార్లు పిచికారీ చేసుకోవాలి.



వైరా రిజర్వాయర్

వైరా రిజర్వాయర్.. 17.3 అడుగులు

వైరా: వైరా రిజర్వాయర్‌లోకి గరిష్ట స్థాయిలో నీరు చేరింది. పూర్తిస్థాయి నీటిమట్టం 18.3 అడుగులు కాగా బుధవారం సాయంత్రానికి నాలుగు వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. దీంతో రిజర్వాయర్‌లో నీటిమట్టం 17.3 అడుగులకు చేరుకుంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షంతో వరద వస్తుండగా త్వరలోనే పూర్తిస్థాయిలో నిండే అవకాశముందని భావిస్తున్నారు.



బుధవారం సాయంత్రం కాల్వొడ్డు వద్ద మున్నేరు ఉధృతి

మున్నేరు.. 12.7 అడుగులు

ఖమ్మంమయూరిసెంటర్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మున్నేరుకు వరద పెరిగింది. ఖమ్మం కాల్వొడ్డు వద్ద బుధవారం రాత్రి 9గంటలకు 12.7 అడుగుల మేర మున్నేరు ప్రవహిస్తోంది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కాల్వొడ్డు వద్ద వరద 16 అడుగులకు చేరితే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నారు. స్థానికంగా వర్షం కురుస్తుండడంతో పాటు ఎగువ ప్రాంతాల నుండి వరద మున్నేరుకు చేరుతుండడంతో వరద పెరిగే అవకాశమున్నందున అధికారులు నిరంతరం గస్తీ కాస్తున్నారు.